ఆరోగ్య రంగంలో పిపిపి!

అవి'నీతి'కి 'ఆయోగ్' రాచబాట

దేశవ్యాప్తంగా రెండో స్థాయి, మూడో స్థాయి పట్టణాల్లో అంటు వ్యాధులుకాని రోగాలకు చికిత్స కోసం ప్రైవేటు భాగస్వామ్యాన్ని అమలు చేయాలని కేంద్ర సర్కారు భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ, నీతి ఆయోగ్ ఈ మేరకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. ప్రపంచబ్యాంకు భాగస్వామ్యంతో ఈ పథకం దేశ వ్యాప్తంగా అతి త్వరలోనే అమలులోకి రానుందని సమాచారం.

ప్రజానీకానికి అత్యంత కీలకమైన ఆరోగ్యరంగాన్ని పూర్తిస్థాయిలో ప్రైవేటు రంగానికి అప్పచెప్పడానికి కేంద్ర సర్కారు సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా ప్రైవేటు భాగస్వామ్యాన్ని నీతి అయోగ్ ఒక పథకం ప్రకారం ముందుకు తెస్తోంది. ప్రపంచబ్యాంకు భాగస్వామ్యంతో దేశ వ్యాప్తం గా ఆరోగ్యరంగంలో పిపిపి మోడల్‌ను అమలు చేయాలన్నది నీతి ఆయోగ్ ప్రతిపాదన! ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రులు పేరుకే పరిమితమయ్యాయి. వసతులు లేక కునారిల్లుతున్నాయి. వాటిని బలోపేతం చేయడానికి బదులుగా కేంద్ర సర్కారు అనుసరించనున్న ఈ విధానం సామాన్య ప్రజానీకానికి వైద్యాన్ని మరింత దూరం చేస్తుందన్న ఆందోళన వ్యక్త మవుతోంది. అదే సమయంలో భారీ ఎత్తున అవినీతికి రాచ బాట వేసే అవకాశమందున్న విశ్లేషణలు వస్తు న్నాయి. ఆ దిశలో ఇప్పటికే అడుగులు వేసిన కర్నాటక అనుభవాలు క్లుప్తంగా:

ప్రైవేటు ఎందుకు?

వ్యాధుల నివారణకు నిర్దిష్ట చర్యలు తీసు కుంటున్నప్పటికీ ప్రస్తుతమున్న వ్యవస్థ అడ్డంకిగా మారిందని, అందువల్ల ప్రజలకు వైద్యాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాన్ని ముందుకు తెస్తున్నామని నీతి ఆయోగ్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ కూడా.. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ రంగ మూ కొనసాగుతుందని, అదే సమయంలో పిపిపి వైద్యమూ అందుబాటులోకి వస్తుందని తెలి పింది. ఇప్పటికే మానవ వన రులు, మౌలిక సదుపాయాల కొరత కారణంగా గ్రామీణ ప్రజల్లో 72 శాతం మంది, పట్టణ ప్రజల్లో 79 శాతం మంది ప్రైవేటు రంగం లోనే ఆరోగ్య సేవలు పొందాల్సి వస్తోంది. ప్రభుత్వ వైద్యాన్ని అభివృద్ధి చేయడానికి నిర్దిష్ట చర్యలు తీసుకున్న ట్లు నీతి ఆయోగ్ చెబు తున్నప్పటికీ దానికి తగ్గ ఆధారాలు ఎక్కడా కనిపించక పోవడం గమ నార్హం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల నుండి మందుల వరకు అన్నింటికీ కొరత నెలకొంటున్న విషయం తెలిసిందే! మరి నీతి ఆయోగ్ పేర్కొన్న నిర్దిష్ట చర్యలేమిటో?. అదే సమయం లో భారీ ఎత్తున వైఫల్యాలు ఉన్నప్పటికీ ప్రపంచ బ్యాంకు ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహి స్తోంది. ప్రపంచబ్యాంకు బాటలో నడుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటువైపే మొగ్గుచూపుతున్నాయి.

పిపిపిలో సూపర్ స్పెషాల్టీ వైద్యసేవ ఇలా!

కర్నాటక ప్రభుత్వం 1997లో రాయ్‌చూర్ లో సూపర్ స్పెషాల్టీ వైద్య సౌకర్యాలు అందించేందుకు ఆర్‌జిఎస్‌ఎస్‌హెచ్‌ను ఏర్పాటు చేసింది. 73 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌కు పెట్రోలియం ఎగుమతి కంపెనీల సంస్థ నుండి రూ.60 కోట్ల ఆర్థిక సహాయం అందింది. సూపర్ స్పెషాలిటీ సేవలు అందించడంలో ఆర్‌జిఎస్‌ఎస్‌హెచ్‌లో పిపిపి పద్ధతిని అంచనా వేసేందుకు ప్రభుత్వ తనిఖీ బృందం హాస్పటల్‌ను సందర్శించింది. ఆ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం దశాబ్ద కాలంగా హాస్పిటల్ పనితీరుపై ఎటువంటి అధ్యయనం జరపలేదు. అటు రాష్ట్ర ప్రభుత్వం కానీ, ఇటు నిర్వహణ కాంట్రాక్ట్ తీసుకున్న అపోలో హాస్పిటల్స్ కానీ ఈ పని చేయలేదు. ఆర్‌జిఎస్‌ఎస్‌హెచ్ స్థాపించడంలో ప్రధాన ఉద్దేశం గుల్బర్గా డివిజన్ మొత్తం జనాభాలో దాదాపు 67 శాతంగా ఉన్న పేదరికపు గీతకు కిందనున్న వారి(బిపిఎల్) కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం. కానీ పదేళ్ల కాలానికి సంబంధించిన హాస్పిటల్ గణంకాలను పరిశీలిస్తే ఇన్ పెషేంట్లలో 25 శాతం వరకే బిపిఎల్ కుటుంబాలకు సేవలు అందించగా, అవుట్ పేషెంట్ల విషయంలో 15 శాతం మందికే సేవలు అందాయి. మొత్తం 350 బెడ్లలో 154 మాత్రమే పని చేస్తున్నాయి. అందులోనూ కేవలం 40 బెడ్‌లు మాత్రమే బిపిఎల్ కుటుంబాలకు అందుబాటులో ఉన్నాయి. ఇంత తక్కువ స్థాయిలో హాస్పిటల్ సామర్థ్యం వినియోగంలో ఉండడం పిపిపి మోడల్ నిర్వహణ పట్ల చిత్తశుద్ధినే ప్రశ్నిస్తున్నదని తనిఖీ బృందం తన నివేదికలో పేర్కొంది.

ఫీజు కట్టాల్సిందే ...!

బిపిఎల్ కుటుంబాలకు సరైన వైద్య సేవలు అందడం లేదంటూ కర్నాటక జన ఆరోగ్య సంస్థ నిజనిర్ధారణ కమిటీ, కర్నాటక రాజ్య రైతు సంఘం ఫిర్యాదు చేశాయి. ఆ తర్వాత బ్రోకర్లు, మధ్యవర్తులు కమిషన్ కోసం రోగులను తెచ్చి చేర్చారు. ఆ తర్వాత బిపిఎల్ కుటుంబాల నుంచి కూడా ఫిర్యా దులు వచ్చాయి. హాస్పిటల్ నిర్వాహకులు ముందు గా రూ.25 వేలు కట్టాలని అడిగారని, కార్డు రెగ్యులరైజ్ అయిన తర్వాత తిరిగి చెల్లిస్తామనే వారని రోగులు చెప్పారు. డబ్బులు కట్టిన తర్వాత రియంబర్స్‌మెంట్ కోసం కార్డు ఇస్తే అది రద్దు అయ్యిందంటూ హాస్పిటల్ నిర్వాహకులు చెప్పేవారని రోగులు పిర్యాదు చేశారు. ఇదో పెద్ద కుంభకోణంగా మారింది. ఈ వ్యవహారాన్ని స్థానిక సంఘాలు బయటపెట్టిన తర్వాత 144 బిపిఎల్ కుటుంబాలకు కార్డులిచ్చి బిల్లు మొత్తాలను తిరిగి చెల్లించారు. ఈ భాగోతాన్నంతా కర్నాటక ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి వివరిం చారు. దీంతో విచారణకు ఆదేశించారు. అయితే విచారణ కమిటీ అపోలో హాస్పిటల్‌ను సేకరించిన డిపాజిట్లను తిరిగి చెల్లించాలని మాత్రమే ఆదేశించింది. 2012 మే 31న అపోలోతో కాంట్రాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది.

ప్రాథమిక వైద్యానికి గండి ఇలా!

కరుణా ట్రస్ట్ ఏడు రాష్ట్రాలైన కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, ఒరిస్సా, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్‌ల్లో 80 ప్రాథమిక చికిత్సా కేంద్రాలను నిర్వహించే ఒప్పందాన్ని కలిగి ఉంది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, బోస్క్ ఫౌండేషన్, పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, ఇండియా డెవలప్‌మెంట్ ఫౌండేషన్, మెక్ ఆర్డర్ ఫౌండేషన్, కర్నాటక హెల్త్ ప్రమోషన్ ట్రస్ట్‌లతో కరుణా ట్రస్ట్ భాగస్వామ్యాన్ని కలిగి ఉంది.

రాష్ట్రాలతో కరుణా ట్రస్ట్ సంతకం చేసిన పిపిపి ఒప్పందం ప్రకారం ఎటు వంటి షరతులు పెట్టకుండా ఎవరైనా నిధులను దానమిస్తే ఆ మొత్తాన్ని ఆరోగ్య రక్షా సమితిలో డిపాజిట్ చేయాలి. ఒక వేళ ఏవైనా షరతులు ఉంటే వాటిని జిల్లా ఆరో గ్య సంఘానికి పంపించాలి. ఆరోగ్య రక్షా సమితిలో పంచాయితీరాజ్ సంస్థల ప్రతి నిధులు, ఎన్జీవోలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది సభ్యులుగా ఉంటారు. వీరంతా కలిసి ట్రస్టీలుగా ఆసుపత్రిని నిర్వహిస్తారు. సివిల్ వర్క్‌కు సంబంధించి రూ.లక్ష లోపు ఉన్న పనుల న్నింటిపైనా ఆరోగ్య రక్ష సమితే నిర్ణయం తీసుకుం టుంది. అంతకన్నా ఎక్కువ మొత్తం అయితే జిల్లా ఆరోగ్య సంఘం అనుమతి కోసం పంపిస్తారు. అయితే కరుణా ట్రస్ట్ నిధుల సేకరణ సమయంలో నేరుగా ఒప్పందాలు చేసుకుంది. ఆరోగ్య రక్షా సమితిలను కనీసం సంప్రదించలేదు. ప్రాథమిక చికిత్సా కేంద్రం నిర్వహణకు నిధులను సమీకరిం చేందుకు గాను యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘించింది. ఆరోగ్య రక్షా సమితిలను పూర్తిగా విస్మరించి కరుణా ట్రస్ట్ మొబైల్ హెల్త్, దంత వైద్యం, టెలీ మెడిసిన్, అంటు వ్యాధులుకాని రోగాలు, సంప్రదాయ వైద్యం, అత్యవసర వైద్యం, ఔషధాలు, కంటి సంరక్షణ, పిల్లల ఆరోగ్యం, ఎయిడ్స్ వ్యాధులకు నిధులను సేకరించింది.

మృతదేహాలు మాయం!

కరుణా ట్రస్ట్ నడుపుతున్న ఒక ప్రాథమిక చికిత్సా కేంద్రంలో 2010 డిసెంబరులో 286 మంది రోగులు చనిపోయారు. చాలా మృతదేహాలు కనిపించకుండా పోయాయి. ఇదో పెద్ద సమస్యగా మారింది. ఆ ప్రాథమిక చికిత్సా కేంద్రంలో గడువు ముగిసిన మందులు ఉన్నాయి. కేంద్రాన్ని నిర్వహి స్తున్న డాక్టర్ అర్హతపైన కూడా అనుమానాలు ఉన్నాయి. మరణాలపై ప్రాథమిక చికిత్సా కేంద్రం చెప్పే లెక్కలకు, అధికారగణం చూపిన లెక్కలకు పొంతన లేదు. ఆ తర్వాత పూర్తి స్థాయి విచారణకు ఆదేశించిన నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ సెల్వకుమార్ మాట్లాడుతూ.. 'లెక్కకు రాని మృత దేహాలను అమ్మేశారా లేదా వాటి అవయవాలతో వ్యాపారం చేశారా అన్నది తేలాల్సి ఉంది' అని పేర్కొన్నారు. ప్రాథమిక చికిత్సా కేంద్రం రిజిస్టర్‌లో ఎటువంటి రికార్డులు లేకుండానే డెత్ సర్టిఫికెట్ లను జారీ చేయడం వల్లే ఈ అనుమానం వచ్చింది. కర్నాటక రాష్ట్ర గుల్బర్గా జిల్లాలోని వి.కె.సాల్గర్ గ్రామంలో జరిపిన ప్రజా విచారణలో కరుణా ట్రస్ట్ నడుపుతున్న ప్రాథమిక చికిత్సా కేంద్రంలోని వైఫల్యాలన్నీ బయటపడ్డాయి. నాణ్యత కల్గిన సేవలు లేక పుట్టిన పిల్లలు, తల్లులు చని పోయారు. సరైన మౌలిక సదుపాయాలు లేవు. ఒక్కో ప్రసవానికి ఐదు వేల నుండి పది వేల రూపా యల వరకు వసూలు చేశారు.

ఒప్పందం నుంచి వెనక్కు ...!

ఇంత జరిగినా ఆరు సంవత్సరాల తరువాత 2016 జనవరి 6న కర్నాటక ప్రభుత్వం పిపిపి లో ఉన్న ప్రాథమిక చికిత్సా కేంద్రాలన్నింటినీ అప్పజెప్పాలని కరుణా ట్రస్ట్‌ను ఆదేశించింది. దాదాపు 52 ప్రాథమిక చికిత్సా కేంద్రాలను ఎన్జీవోలకు, ఛారిటబుల్ ట్రస్టులకు, ప్రయివేట్ మెడికల్ కాలేజీలకు అప్పగించిన ఆరోగ్య బంధు పథకాన్ని రద్దు చేసుకుంటున్నట్లు కర్నాటక ప్రభు త్వం ఉత్తర్వులు ఇచ్చింది. నిబంధనలు పాటించక పోవడం, నిధుల దుర్వినియోగం, జవాబుదారీతనం లేకపోవడం, రోగులకు నాణ్యమైన సేవలను అందించడంలో విఫలం కారణంగా అన్ని ప్రాథమిక చికిత్సా కేంద్రాలను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. "మా నివేదిక ప్రకారం ప్రాథమిక చికిత్సా కేంద్రాల నిర్వహణలో జవాబు దారీతనం లేదు. కొన్ని ఎన్జీవోలు అవసరమైన డాక్టర్లను కూడా నియమించలేదు. కొన్నిచోట్లతే అయాష్ డాక్టర్లతో పని కానిచ్చేశారు. కొన్ని కేంద్రాల్లో శిక్షణ లేని నర్సులను నియమించారు" అని అప్పుడు ఆరోగ్య శాఖా మంత్రి చెప్పారు.

ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్న వైఫల్యాల ఉదాహరణలను పరిగణనలోకి తీసుకోకుండా పిపిపి మోడల్‌ను అనుసరించాలని నీతి ఆయోగ్ నిర్ణయించడం దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. భారత విధాన నిర్ణేతలు ఆధారాలు గురించి మాట్లాడుతూ ఉండవచ్చు గానీ, వాస్తవంలో అన్ని ఆధారాలను పక్కకు తోసేసి ప్రపంచ బ్యాంక్, కార్పొరేట్ మాఫియా వైద్య రంగాన్ని కబళించడానికి సిద్ధంగా ఉన్నాయి. కర్నాటకతోపాటు తెలుగు రాష్ట్రాల్లోనూ విఫలమైన పిపిపి మోడల్ ఒక ప్రశ్నను ముందుకు తెస్తోంది. ఈ ప్రయోగం వల్ల ప్రజా ఆరోగ్య వ్యవస్థకు, ప్రజల ఆరోగ్యానికి జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు..?

కర్నాటక.. ఎపి.. తెలంగాణల్లో..

దేశవ్యాప్తంగా అమలు చేస్తామని నీతి ఆయోగ్ చెబుతున్న పిపిపి విధానం ఇప్పటికే కర్నాటకలో అమ లవుతోంది. ప్రణాళికా సంఘం కర్నాటకలో రెండు ప్రభుత్వ-ప్రయివేట్ భాగస్వామ్య(పిపిపి) మోడల్స్‌ను చేపట్టింది. ఒకటి రాయ్‌చూర్‌లో రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రెండోది రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కరుణా ట్రస్ట్ ప్రాథమిక చికిత్సా కేంద్రాల నిర్వహణ, గ్రామీణ ఆరోగ్య సేవలను అందించడం. ఈ రెండూ ప్రాజెక్టులూ విఫలమయ్యాయి. పూర్తిస్థాయిలో, తక్కువ ఖర్చుతో వైద్యం అందించడానికి ఈ రెండు రకాల నమూనాలు పనికిరావని తేలిపోయింది. వాజ్‌పేయి ఆరోగ్యశ్రీ పథకం ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత చిన్నాభిన్నం చేసింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం గుర్తించిన ఆస్పత్రులు ప్రభుత్వ డబ్బుతో పేద లకు వైద్యాన్ని అందిస్తాయి. ఈ పథకం కారణంగా బెంగళూర్‌లోని ప్రయివేట్ ఆసుపత్రులన్నీ బాగు పడ్డాయి. ఈ పథకంలో లొసుగుల్ని నియంత్రించాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు కార్పొరేట్ ఆసుపత్రులు అడ్డుపడుతున్నాయి. అంతేకాదు వైద్యాన్ని ఒక సరుకుగానే చూడాలనే భావనను కల్గిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ పథకం ఇదే నమూనాలో అమలవుతున్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రాల్లోనూ ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రులే లబ్ధి పొందుతున్న విషయం తెలిసిందే.

అభివృద్ధికి అడ్డుపడుతున్న జగన్ : కెఇ

ప్రజాశక్తి- నంద్యాల

నంద్యాల అభివృద్ధిని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఉపముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి ఆరోపించారు. మంగళవారం కర్నూలు జిల్లా నంద్యాలలో ఆయన మాట్లాడారు. నంద్యాలలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నాటి నుంచి ప్రతిపక్షంగా ఉన్న జగన్మోహన్‌రెడ్డికి చేతులు కాళ్లు ఆడటం లేదన్నారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకోజూశారని, అది చేతకాకపోవడంతో నేడు నంద్యాల అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అవినీతిలో పుట్టి అవినీతిలో పెరిగిన సాక్షిని అడ్డం పెట్టుకుని వైసిపి అభివృద్ధి నిరోధకుల పార్టీగా మారిందని ధ్వజమెత్తారు. కేసుల నుంచి తప్పించుకోడానికే ప్రధాని మోడీ ముందు మోకరిల్లిన జగన్ అవినీతి, ఆరోపణల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసిపి అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి మైనార్టీలను అనేక ఇబ్బందులకు గురిచేసిన కారణంగా ముస్లిం మైనార్టీలు పూర్తిగా దూరమయ్యారని అన్నారు. మాజీ మంత్రి ఫరూఖ్‌కు పదవి రాకుండా అడ్డుపడిన ఘనత ఆయనదేనన్నారు. జగన్మోహన్‌రెడ్డి సొంత ప్రాంతంలో ఎమ్మెల్సీని గెలిపించుకోలేకపోయారని, అలాంటి వ్యక్తి నంద్యాలకు వచ్చి ఏమి చేస్తారని ఎద్దేవా చేశారు.

పిడుగుపాటుకు మరో రైతు మృతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లాలో మంగళవారం పిడుగుపాటుకు మరో రైతు మృతి చెందాడు. ఇచ్ఛాపురం మండలం బెల్లుపడ గ్రామానికి చెందిన ఉప్పాడ పురుషోత్తం (35) పొలం పనులు చేసుకుంటున్న సమయంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సమీపంలో పిడుగు పడటంతో అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, నందిగాం మండలం శివరాంపురం గ్రామానికి చెందిన రైతు లండ ముఖలింగం (58) పిడుగుపాటుకు సోమవారం మృతి చెందిన సంగతి తెలిసిందే.

వందేమాతరం, జనగణమన ఆలపించాల్సిందే

ప్రజాశక్తి - తిరువూరు

ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో తప్పనిసరిగా ప్రతిరోజూ అసెంబ్లీ నిర్వహించి వందేమాతరం, జనగణమన గీతాలాపన చేయాలని ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి (ఆర్ఐఓ) ఆనంద్‌కుమార్ చెప్పారు. కృష్ణాజిల్లా తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడెడ్ జూనియర్ కళాశాలల యాజమాన్యం, ప్రిన్సిపల్స్‌తో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో ఇక నుంచి అసెంబ్లీ సమావేశం నిర్వహించి సూక్తితో కూడిన ఒక మంచి సందేశాన్ని విద్యార్థులకు వివరించాలన్నారు. జిల్లాలోని 266 కళాశాలల్లో దీనిని అమలు చేయాలన్నారు.

కొలిక్కిరాని టీచర్ల బదిలీలు

- కలెక్టర్, మంత్రి రోజుకో మాట
- విద్యార్థుల జీవితాలతో ఆట

ప్రజాశక్తి - చిత్తూరు ప్రతినిధి

రాష్ట్రంలో ఏ జిల్లాలోనూలేని విధంగా చిత్తూరు జిల్లాలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు. అన్ని జిల్లాల్లో ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయి తరగ తులు జరుగుతుంటే.. చిత్తూరు జిల్లాలో మాత్రం ఇంకా రేషనైలేజేషన్‌తోనే కుస్తీ పడుతున్నారు. దీంతో అటు ఉపాధ్యాయుల్లోనూ, ఇటు విద్యార్థుల్లోనూ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. వరుసగా మూడుసార్లు పదోతరగతిలో చివరి స్థానంలో ఉన్న ఈ జిల్లాలో ప్రభుత్వ తీరు మరింత ఆవేదనను మిగుల్చుతోంది.

రోజుకో నిర్ణయం

జిల్లాలో ఒక్క పాఠశాలను మూత వేసేందుకు వీల్లేదని కలెక్టర్ ప్రద్యుమ్న, మంత్రి అమర్‌నాథరెడ్డి ఆది నుంచీ ప్రకటిస్తూ వచ్చారు. అన్ని రకాల ప్రయత్నాలూ చేసి, ప్రభుత్వ నిర్ణయాల్లో భాగంగా జిల్లాలో 51 పాఠశాలలు మూతపడతాయని కలెక్టర్ ఇటీవల ప్రకటించారు. వీటిల్లో ప్రాథమిక పాఠశాలలు 20, ప్రాథమికోన్నత పాఠశాలలు 28, ఉన్నత పాఠశాలలు మూడు ఉన్నాయి. ఈ మేరకు అధికారులు రేషనైలేజేషన్‌ను ప్రారంభించారు. నెల రోజుల నుంచి వేచి చూస్తున్న ఉపాధ్యాయుల్లో దీనిపై హర్షం వ్యక్తమైంది. అయితే మంత్రి అమర్‌నాథరెడ్డి ప్రాథమిక పాఠశాలలన్నీ ఉంటాయని, ప్రభుత్వంతో మాట్లాడుతున్నాని చెప్పారు. దీంతో బదిలీ ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో రేషనైలేజేషన్ పూర్తయ్యింది. నెల్లూ రు మినహా అన్ని ప్రాంతాల్లోనూ ఉపాధ్యాయుల బదిలీలు పూర్తయి ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు చెబుతున్నారు.

బదిలీల కోసం పదివేల మంది ఎదురు చూపు

చిత్తూరు జిల్లాలో 10 వేల మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు. ఇది పూర్తయితే తప్ప వారు పూర్తి స్థాయిలో విద్యార్థులకు పాఠాలు చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. రేషనలైజేషన్ పూర్తయితే పాయింట్ల ఆధారంగా సీనియారిటీ జాబితా సిద్ధం చేయాల్సి ఉంది. తరువాత దీనిపై అప్పీళ్లు ఉంటాయి. ఇది ఒకే అయిన తరువాత మళ్లీ సినియారిటీ జాబితా సిద్ధం చేయాల్సి ఉంది. తరువాత బదిలీల షెడ్యూలు, ఉపాధ్యాయులు వారికి కేటాయించిన స్థానానికి వెళ్లేందుకు మరింత సమయం పడుతుంది. ఇలా ఈ తంతంగం పూర్తయ్యే సరికి కనీసం 20 రోజులు పడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పిల్లల చదువులు కొండెక్కినట్టేనని విమర్శలు వస్తున్నాయి.

షాపు వద్ద గుమిగూడిన బాధితులు

బోర్డు తిప్పేసిన సాయిరామ్ ట్రేడర్స్

రూ.2 కోట్లతో ఉడాయించిన మోసగాళ్లు

ప్రజాశక్తి-సత్యవేడు (చిత్తూరు)

'సగం ధరకే వస్తువులు ఇస్తాం' అని నమ్మబలికి దాదాపు 400 మంది దగ్గర రూ.2 కోట్లను వసూలు చేసి సాయిరామ్ ట్రేడర్స్ బోర్డు తిప్పేసి ఉడాయించింది. విషయం తెలుసుకున్న బాధితులు మంగళవారం షాపు వద్దకు వచ్చి లబోదిబోమన్నారు. బాధితుల కథనం మేరకు.. గత నెల 13న సత్యవేడు పెట్రోల్‌బంక్ సమీపంలోని కాంప్లెక్స్‌లో 'సాయిరామ్ ట్రేడర్స్ మరియు ఆర్డర్ సప్లయర్స్' పేరుతో నూతన షాపును ప్రారంభించారు. ప్రారంభ ఆఫర్‌గా ఆడినెల (ఆషాడమాసం) పూర్తిగా 10-40 శాతం వరకు తక్కువ ధరకు వస్తువులను అందిస్తామని ప్రకటించారు. బీరువా, వాషింగ్‌మిషన్, ఎల్ఇడి టీవీ, ఫోన్లు, వంటసామాగ్రి అన్ని రకాల వస్తువులను 40 శాతానికే విక్రయించనున్నట్లుగా షాపులో ప్రదర్శనకు ఉంచారు. డబ్బు కట్టిన వారికి 10 రోజుల తరువాత వస్తువులు ఇస్తామని నమ్మబలికారు. ముందుగా డబ్బు కట్టి ఆర్డర్ చేయడం వలనే ఇంత తక్కువ ధరకు ఇవ్వగలుగుతున్నామన్నారు. మొదట్లో డబ్బు కట్టిన కొంతమందికి తక్కువ ధరకే వస్తువులను ఇవ్వడంతో జనం నమ్మారు. తాము దాదాపు రూ.25 లక్షలు షాపుకు అడ్వాన్స్ ఇచ్చినట్లు చెప్పారు. పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ వద్ద డబ్బులు చెల్లించారని రశీదులు చూపించారు. మంగళవారం ప్రజలు వస్తువుల కోసం షాపు వద్దకు వెళ్లగా చాలా సేపటి వరకూ షాపు తెరవకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా షాపు యజమానులు వారి నివాస స్థలం నుంచి ఉడాయించినట్లు తెలిసింది. రూ.100 నుంచి రూ.3 లక్షల వరకు కట్టిన బాధితులు షాపు ముందు గగ్గోలు పెట్టారు. పెద్దఎత్తున జనం పోగవడంతో ఎస్ఐ మల్లేష్‌యాదవ్ పోలీసు బృందంతో షాపు వద్దకు చేరుకుని బాధితుల ఫిర్యాదులను స్వీకరించారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. షాపు యజమానుల అడ్రస్సును, ఆధార్‌కార్డు, జిఎస్‌టి వివరాలను పోలీసులకు అందించారు. ఎటువంటి గ్యారంటీ లేకుండా ఇటువంటి వ్యాపారాలు చేస్తుంటే ముందుగా పోలీసులకు ఎందుకు అనుమానం రావడం లేదని సోమశేఖర్ ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కేశవరెడ్డి బాధితులకు న్యాయం చేస్తాం

బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-నంద్యాల క్రైం

కేశవరెడ్డి బాధితులకు న్యాయం చేస్తామని వైసిపి రాష్ట్ర నాయకులు బొత్సా సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కర్నూలు జిల్లా నంద్యాలలో కేశవరెడ్డి బాధితులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శిల్పా మోహన్ రెడ్డి నివాసం వద్ద బొత్స సత్యనారాయణను కలిసి బాధితుల పక్షాన ప్రభుత్వంపై వత్తిడి తేవాలని వినతి పత్రం అందజేశారు. బాధితులు ముందుగా ఆర్‌టిసి బస్టాండ్ నుంచి శ్రీనివాస సెంటర్ వరకు ప్రదర్శన చేశారు. వీరి ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, నాయకులు సద్దాం హుసేన్, నర్సింహ, లక్ష్మన్, శ్రీధర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల నిమిత్తం లక్షల రూపాయలు వసూలు చేశారు. స్కూల్ మూసివేయడంతో 10,336 మంది కేశవరెడ్డి బాధితులు ఉన్నారని, వారికి మొత్తం రూ.300 కోట్లు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేశవరెడ్డిని కాపాడుతుందని, అతని ఆస్తులు జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మస్తాన్‌వలి మాట్లాడారు. కేశవరెడ్డి వియ్యంకుడు, మంత్రి ఆదినారాయణరెడ్డి కేశవరెడ్డి ఆస్తులను తన పేరుమీద రాయించుకుని బాధితులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. సంక్షేమ ప్రభుత్వంమని చెబుతున్న టిడిపికి చిత్తశుద్ధి ఉంటే కేశవరెడ్డి ఆస్తులమ్మి బాధితులకు డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ దృష్టికి కేశవరెడ్డి బాధితుల సమస్యను తీసుకెళ్లి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఆదివాసీల ఆరోగ్య పరిరక్షణకు కృషి

రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో ఆదివాసీల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని గిరిజన గురుకుల పాఠశాలల్లోనూ చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో 'ఆదివాసీ ఆరోగ్యం' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించామని తెలిపారు. మంగళవారం గుంటూరులోని ఎస్‌టి బాలుర హాస్టల్‌లో ఆదివాసీ ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించి 'స్పర్శ్' మొబైల్ యాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపి, వారిలో తీవ్రమైన వ్యాధులుంటే ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలతో పోషకాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రంలో 565 గిరిజన పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లను నియమించి వారి ద్వారా విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోన శశిధర్, స్థానిక ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ ఎయస్ రామకృష్ణ, గిరిజన సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో భూముల సర్వే రికార్డులను పరిశీలించాలి

లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ

ప్రజాశక్తి - అనకాపల్లి (విశాఖ)

ప్రతి 10, 15 ఏళ్లకు ఒక్కసారైనా క్షేత్రస్థాయిలో భూముల సర్వే రికార్డుల పరిశీలన జరగాలని లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ తెలిపారు. పట్టణంలోని ఒక హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి క్రయవిక్రయాలు సేల్‌డీడ్‌తో సరిపుచ్చుకుండా టైటిల్ డీడ్ గుర్తించే విధంగా చట్టాన్ని మార్పు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తౌలిత భూముల రికార్డులు, సర్వే విధానం, రెవెన్యూ సేవలపై విషయ పరిజ్ఞానం కలిగించేందుకు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. రికార్డుల నమోదుపై సరైన అవగాహన లేకపోవడం వల్ల తప్పులు దొల్లుతున్నాయని, వాటిని సరిచేయడం కష్టతరం కాదని పేర్కొన్నారు.ఆచరణ సాధ్యమైన సేవలు అందించడంలో కూడా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండడం ఆక్షేపణీయమన్నారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence
Registered Office: Plot No.21, Jawaharlal Nehru Pharma City, Parawada, Visakhapatnam - 531 021, Andhra Pradesh, India.
Corporate Office: 2nd Floor, Serene Chambers, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034, Telangana, India.
Contact Numbers: Tel: +91 40 3980 4333; Fax: +91 40 3980 4320
E-mail: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com
Corporate Identity Number: L24239AP2005PLC047518

NOTICE

Notice is hereby given, pursuant to Regulation 29 of SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015, we hereby inform you that a meeting of the Board of Directors of the Company will be held on Thursday, August 10, 2017, inter-alia, to consider and approve the Unaudited Financial Results of the Company for the Quarter ended June 30, 2017.

By Order of the Board
For **Laurus Labs Limited**
Place: Hyderabad
Date: August 2, 2017
Sd/- **G.Venkateswar Reddy**
Company Secretary